క్లుప్తంగా

సంక్షేమ పథకాలతో సంతృప్తి



కరపత్రాలను పంపిణీ చేస్తున్న నేతలు

పులిచెర్ల(కల్లూరు): ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలతో ప్రజలు సంతృప్తిగా ఉన్నారని, ఈ పథకాలు తిరిగి కొనసాగాలంటే మళ్లీ ముఖ్యమంత్రిగా జగనన్న రావాలని వైఎస్సార్‌సీపీ నేతలు తెలిపారు. ఎల్లంకివారిపల్లె పంచాయతీలో ఆదివారం ఇంటింట ప్రచారం నిర్వహించారు. సంక్షేమ లబ్ధిని వివరించి కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో విరూపాక్షి జయచంద్రారెడ్డి, సైపుల్లా, ఆనంద, క్రిష్ణమూర్తి, రాజమూర్తి పాల్గొన్నారు.

పురాతన ఆలయాలకు వైభవం

పుంగనూరు: టీటీడీ శ్రీవాణి ట్రస్ట్ ద్వారా ఎస్సీ, ఎస్టీ, మత్స్యకార ప్రాంతాలలో ఆలయాలు నిర్మిస్తున్నారని సమరసత సేవా ఫౌండేషన్ కన్వీనర్ త్రిమూర్తిరెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ టీటీడీ ఇప్పటి వరకు 500 ఆలయాలు నిర్మించిందన్నారు. అలాగే శ్వేత ఆధ్వర్యంలో శిక్షణ పొందిన వివిధ కులస్తులైన 5వేల మంది విద్యార్థులు తమ ప్రతిభను ఆయా ప్రాంతాల్లో ప్రదర్శించడం అభినందనీయమన్నారు. ఇలాంటి విద్యార్థులను ఆశీర్వదించి ప్రోత్సహించి ధార్మిక మార్పును స్వాగతించాలని కోరారు. ప్రతినిధులు డాక్టర్ శరణ్, ఎరమలనాయుడు, కుమారస్వామి, రాజారెడ్డి, రాజశేఖర్ పాల్గొన్నారు.

వికసించిన మే పుష్పం



బైరెడ్డిపల్లి: బైరెడ్డిపల్లెకు చెందిన బి.శేషేగౌడు పెరట్లో ఆదివారం ఉదయం మే పుష్పం వికసించింది. మే పుష్పం పూయడంతో చుట్టుపక్కల మహిళలు ప్రత్యేక పూజలు చేశారు.

ఆటోమొబైల్స్ వర్కర్ల సమావేశం

పుంగనూరు: పట్టణంలోని ఆటోమొబైల్స్ వర్కర్ల సమావేశం ఆదివారం నిర్వహించారు. సంఘ కార్యదర్శి మస్తాన్ ఆధ్వర్యంలో కార్మికులు సమావేశమై తమ సమస్యలపై చర్చించారు. ఆటోనగర్ ఏర్పాటు చేసేందుకు రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి వెంకటమిథున్‌రెడ్డి హామీ ఇచ్చిన నేపథ్యంలో కార్మికులు ఈ మేరకు జాబితాలు సిద్ధం చేస్తున్నారు.

జ్వరంతో విద్యార్థిని మృతి

సదుం: జ్వరంతో బాధపడుతూ చికిత్స పొందుతున్న విద్యార్థిని ఆదివారం మృతిచెందింది. వెన్నల సాయిశ్రీ(14) స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల్లో ఎనిమిదవ తరగతి చదువుతుంది. బాలిక తండ్రి చెన్నకేశవులు కందూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడు. బాలిక జ్వరంతో బాధపడుతూ ఉండడంతో శనివారం ఆమెను తిరుపతి రుయా ఆస్పత్రిలో చేర్చారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందింది. ఆమె మృతి పట్ల ఉపాధ్యాయులు, విద్యార్థులు సంతాపం వ్యక్తం చేశారు.

నేడు వాహనాల వేలం

కుప్పం: కుప్పం ఎస్ఈబీ శాఖ వివిధ కేసుల్లో సీజ్ చేసిన వాహనాలను వేలం వేయనున్నట్లు సీఐ కిషోర్‌కుమార్ తెలిపారు. సోమవారం ఉదయం 10 గంటలకు వేలం వేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. వేలం పాటలో పాల్గొనేవారు సెబ్ కార్యాలయంలో రూ.5 వేలు డిపాజిట్ చేసి పేరు నమోదు చేసుకోవాలని ఆయన అన్నారు.

ఆధ్యాత్మిక గ్రంథాలను ఆచరించాలి

గుడుపల్లె: త్రైత సిద్ధాంత భగవద్గీత అనుసంధాన ఆధ్యాత్మిక గ్రంథాలను ప్రతిఒక్కరూ ఆచరించాలని త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవ సమితి సభ్యులు పేర్కొన్నారు. ఆదివారం పెద్దపర్తికుంట, చిన్నపర్తికుంట గ్రామాల్లో త్రైత సిద్ధాంత ఆధ్యాత్మిక గ్రంథాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. క్రిష్ణ, శరవణ, శివకృష్ణ మంజునాథ్‌శెట్టి పాల్గొన్నారు.

ఉచిత యోగా క్యాంపు



మాట్లాడుతున్న ప్రిన్సిపల్

పలమనేరు: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉచిత యోగా, వాలీబాల్, ఫుట్‌బాల్ క్యాంపులను వేసవి సెలవుల సందర్భంగా నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డా.వెంకటేశులు శనివారం తెలిపారు. ఈ శిక్షణలో పాల్గొన్న వారికి జిల్లా స్పోర్ట్స్ అథారిటీ నిర్వాహకులు సర్టిఫికెట్లను ప్రదానం చేస్తారని తెలిపారు. భవిష్యత్తులో ప్రభుత్వ ఉద్యోగాలను పొందేందుకు ఈ సర్టిఫికెట్లు ఉపయోగపడతాయని తెలిపారు. అవకాశాన్ని ఆసక్తి గలవారు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కనులపండువగా కల్యాణోత్సవం

సదుం: మండలంలోని పెడకంటివారిపల్లె కోదండ రామాలయంలో సీతారాముల కల్యాణోత్సవం కనులపండువగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయంలో గణపతిపూజ, కలశస్థాపన, హోమాలు, పూజలు నిర్వహించారు. ఉత్సవ మూర్తులను గ్రామంలో ఊరేగించారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు. విశేషసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

చూస్తే కొనియాడు‘తారు’

- రూ.1.65 కోట్లతో పూర్తయిన బీటీ, సీసీ రోడ్లు
- ఇచ్చిన మాట నిలుపుకున్న ఎమ్మెల్యే వెంకటేగౌడ
- గడ్డూరు, గంటావూరు కాలనీలకు రూ.5కోట్లతో ప్రతిపాదనలు



పట్టణంలో తారురోడ్లతో వీధులు



పలమనేరు: పట్టణంలోని పలు రోడ్లు ఇప్పుడు సుందరంగా మారాయి. చక్కగా తారురోడ్లను వేయడంతో పట్టణ వాసులకు ఎంతో సౌకర్యంగా మారింది. మున్సిపాలిటీ అభివృద్ధి కోసం తప్పకుండా కృషిచేస్తానంటూ స్థానిక ఎమ్మెల్యే వెంకటేగౌడ ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారు. దీంతోపాటు మున్సిపల్ పాలకవర్గం సైతం పట్టణంలో రహదారుల అభివృద్ధికి పెద్దపీట వేసింది. గతంలో టీడీపీ పాలనలో పట్టణంలోని రోడ్లను పట్టించుకోలేదు. దీనిపై ప్రత్యేక దృష్టిని సారించిన ప్రభుత్వం పట్టణంలో అన్ని వీధులకు సీసీ, బీటీ రోడ్లను వేసింది. దీంతో పట్టణ వాసులు సైతం హర్షం వ్యక్తం చేస్తున్నారు.

చక్కగా తారురోడ్లు..

పట్టణంలోని ఐదు వీధుల్లో స్టేట్ ఫైనాన్స్ కమిషన్, జీజీఎంపీ, సీడీఎస్, మున్సిపల్ జనరల్ ఫండ్ ద్వారా రూ.1.65 కోట్లతో 3.5 కిలోమీటర్ల బీటీ రోడ్లు, 0.5కి.మీలో సీసీ రోడ్ల నిర్మాణ పనులను చేపట్టారు. ఇందులో భాగంగా పట్టణంలోని మదనపల్లి రోడ్డు రెక్కమాను సర్కిల్ నుంచి జిలానీ సర్కిల్ దాకా తారు రోడ్డు వేశారు. నిత్యం రద్దీగా ఉండే ఈ వీధిలో తారువేయడంతో చాలా ఉపయుక్తంగా మారింది. ఇక గంగమ్మగుడి వీధి, తాలుకా కచ్చేరి వీధి, జెండామఠం, రాధాబంగ్లా రహదారుల్లో ఎక్కువ బిజీగా ఉంటుంది. ఈ మార్గాల్లో బీటీరోడ్ల అవసరాన్ని గుర్తించిన కౌన్సిల్ ఎన్ని ఇబ్బందులున్నా ప్రజల సౌకర్యం కోసం రోడ్లకు పెద్దపీట వేసింది.

అన్ని వార్డులకు సీసీరోడ్లు..

మున్సిపాలిటీలోని 26 వార్డుల్లో సీసీ రోడ్లు ఉన్నాయి. ఇందులో దెబ్బతిన్న చోట్ల ఇప్పటికే రూ.20లక్షలతో ప్యాచ్‌వర్క్ జరిగింది. మరోవైపు అన్ని వార్డులకు సమానంగా సీసీ రోడ్డు వేశారు. దీంతో పట్టణంలో సీసీ రోడ్డు లేని వీధి లేనట్టే. ఈ వీధుల్లో లైటింగ్‌కోసం ఐదువేల విద్యుత్ దీపాలను ఏర్పాటు చేశారు.

రూ.5కోట్లతో కాలనీల్లో సీసీ రోడ్లు..

గంటావూరు, గడ్డూరు కాలనీల్లో సైతం 15కి లోమీటర్ల మేర సీసీ రోడ్లకు ఇప్పటికే స్థానిక మున్సిపల్ అధికారులు రూ.5 కోట్లతో ప్రతిపాదనలు పంపారు. నిధులు మంజూరు కాగానే ఈ పనులను మొదలు పెట్టనున్నట్టు స్థానిక మున్సిపల్ డీఈ పుష్పగిరి నాయక్ తెలిపారు.

మున్సిపాలిటీని రోల్ మోడల్‌గా చేస్తాం..



తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పట్టణంలో వీధుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాం. అధ్వానంగా మారిన వీధుల్లో తారురోడ్లు ఇప్పటికే వేయించాం. అన్ని వార్డులో సీసీ రోడ్ల నిర్మాణాలు చేపట్టాం. చరణ్‌దాబా నుంచి గంటావూరు దాకా పాతహైవేలో కొత్తగా తారు వేయించాం. పలమనేరు మున్సిపాలిటీ రోల్‌మోడల్‌గా ఉండాలన్నదే నా లక్ష్యం. పెండింగ్‌లోని ఇందిరమ్మ కాలనీల్లోనూ సీసీ రోడ్లు వేస్తాం.

– ఎన్ వెంకటేగౌడ, ఎమ్మెల్యే, పలమనేరు

పట్టణ అభివృద్ధికి పెద్దపీట..



పట్టణంలో మౌలిక సదుపాయాలకు పెద్దపీట వేశాం. తారు రోడ్ల మంజూరుకు పాలకవర్గానికి సహకరించిన ఎమ్మెల్యే వెంకటేగౌడకు రుణపడి ఉంటాం. త్వరలో రూ.5కోట్లతో గంటావూరు, గడ్డూరులలో సీసీ రోడ్లు వేస్తాం. ప్రజలు తమకిచ్చిన అవకాశానికి వారికి మంచి సేవలందించడం, పట్టణాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళ్లడమే ధ్యేయంగా తమ పాలకవర్గం కృషిచేస్తోంది.

– పవిత్ర, మున్సిపల్ చైర్‌పర్సన్, పలమనేరు

పేదవారికి కొండంత అండ జగనన్న



గడప గడపకు కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంకటేగౌడ

- పలమనేరు ఎమ్మెల్యే వెంకటేగౌడ

పలమనేరు: పేదవారికి కొండంత అండ మన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని పలమనేరు ఎమ్మెల్యే వెంకటేగౌడ పేర్కొన్నారు. పలమనేరు మున్సిపాలిటీ పరిధిలోని 19వార్డులోని దండుమిట్ట, ఎంబీఎస్, షికారీ కాలనీలు, సోనియానగర్, నీళ్లకుంట, టీఎస్ అగ్రహారం, బొమ్మిదొడ్డిలలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే ఇంటింటికి వెళ్లి సంక్షేమ లబ్ధిని వివరించి బుక్‌లెట్ అందజేశారు. అనంతరం ప్రజల సమస్యలను తెలుసుకుని సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హతే భాగంగా అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలను అందిస్తున్న జగనన్న ప్రభుత్వాన్ని మళ్లీ ఆదరించాలని కోరారు.

నేటి సంక్షేమ పాలనలో అన్ని వర్గాలు సంతృప్తిగా ఉన్నాయని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలను మభ్యపెట్టాలని చూస్తున్న టీడీపీ డ్రామాలను జనం ఎండగట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఏఎంసీ చైర్మన్ హమంత్‌కుమార్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ పవిత్ర, నేతలు మండీ సుధా, క్యూడీఎస్ రాజేష్, శ్యామ్, నరేష్ పాల్గొన్నారు.

సింహవాహనంపై విహరించిన కోనేటిరాయుడు



సింహవాహనంపై విహరిస్తున్న కోనేటిరాయుడు,



కోనేటిరాయునికి ఊంజల్‌సేవ

గంగవరం: మండలంలో టీటీడీ అనుబంధ క్షేత్రం కీలపట్ల కోనేటిరాయస్వామి ఆలయంలో శ్రీవారి బ్రహ్మోత్సవాలు వేడుకగా సాగుతున్నాయి. టీటీడీ పురోహితుల వేద మంత్రోచ్ఛరణల నడుమ శ్రీవారి ఉత్సవాలు శాస్త్రోక్తంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా మూడవ రోజు ఆదివారం ఉదయం శ్రీదేవి భూదేవి సమేత కోనేటిరాయుడు సింహవాహనంపై గ్రామ పురవీధుల్లో విహరించి భక్తులను అనుగ్రహించారు. ఉదయం స్వామివారికి సుప్రభాతసేవ, తోమాలసేవ, చందన పుష్ప తాంబూలాదులతో అభిషేకించి శ్రీవారి ఘంటానాదం అనంతరం నైవేద్యాన్ని సమర్పించారు. తరువాత తిరుచ్చిపై విహరించారు. మధ్యాహ్నం ఉభయ దేవేరులకు స్నపన తిరుమంజనం నిర్వహించగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని శ్రీవారికి జరిగే కైంకర్యాలను భక్తిశ్రద్ధలతో వీక్షించారు. తరువాత సాయంత్రం శ్రీదేవి భూదేవి సమేతుడైన కోనేటిరాయుడు బకాసుర వధ అలంకరణలో రుక్మిణి, సత్యభామతో కలిసి ఊంజల్‌పై కొలువుదీరారు. అన్నమాచార్య ప్రాజెక్టు ఆధ్వర్యంలో పలువురు అన్నమయ్య సంకీర్తనలు ఆలపించారు. తరువాత రాత్రి శ్రీనివాసుడు సతీ సమేతంగా ముత్యపు పందిరి వాహనంలో కొలువై గ్రామ మాడ వీధుల్లో విహరించారు. అడుగడుగునా భక్తులు శ్రీవారి వాహనసేవ ఎదుట టెంకాయలు కొట్టి కర్పూర నీరాజనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. వాహనసేవ ముగిసిన అనంతరం కోనేటిరాయస్వామివారు తిరిగి ఆస్థాన మండపానికి చేరుకున్నారు. నేడు ఉదయం శ్రీవారు కల్పవృక్ష వాహనం, రాత్రి సర్వభూపాల వాహనంలో విహరించి భక్తులను అనుగ్రహిస్తున్నట్లు టెంపుల్ ఇన్‌స్పెక్టర్ గజేంద్ర తెలిపారు.

సైబర్ నేరాలపై అవగాహన



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్‌ఐ

పెద్దపంజాణి: మండలంలోని రాయలపేట, కోగిలేరు, పెనుగొలకల గ్రామాల్లో ఆదివారం ఎస్‌ఐ శ్రీనివాసులు సైబర్ నేరాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. పేకాట, ఇసుక అక్రమ రవాణా చేస్తే చర్యలు తప్పవన్నారు. రాయలపేట గ్రామంలో ట్రాఫిక్‌కు అంతరాయం కల్గిస్తూ రోడ్డును ఆక్రమించి దుకాణాలు ఏర్పాటు చేసుకున్న వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వాహన, దుకాణాదారులు ట్రాఫిక్‌కు ఇబ్బంది కలగకుండా సహరించాలని కోరారు. అనంతరం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు.

నందివాహనంపై మృత్యుంజయేశ్వరుడు

చౌడేపల్లె: మండలకేంద్రంలోని అభీష్టద మృత్యుంజయేశ్వరస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న ఉత్సవాలలో భాగంగా ఐదవ రోజు ఆదివారం మృత్యుంజయేశ్వరుడు నందివాహనంపై విహరించారు. శివపార్వతుల ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి నందివాహనంపై కొలువుదీర్చారు. అనంతరం పురవీధుల్లో విహరిస్తూ భక్తులను కటాక్షించారు. ఆదిశేషుడుగా పేరొందిన మృత్యుంజయేశ్వరునికి పెద్ద సంఖ్యలో భక్తులు పూజలు చేశారు.

త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం

రామకుప్పం: మండలంలోని సగినేకుప్పం గ్రామంలో ఆదివారం ప్రబోధ సేవా సమితి ఆధ్వర్యంలో త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం నిర్వహించారు. ఆత్మ, జీవాత్మ, పరమాత్మల ద్వారా ధర్మస్థాపన సాధ్యమవుతుందని తెలిపేది త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రధాన ఉద్దేశమన్నారు. త్రైత సిద్ధాంత భగవద్గీత పఠనం ద్వారా సమసమాజ స్థాపన సాధ్యపడుతుందన్నారు. ప్రబోధ సేవా సమితి శివరామపురం, వీకోట అధ్యక్షుడు కృష్ణమూర్తి, అశోక్‌బాబు పాల్గొన్నారు.

బిల్లేరులో రామకోటి ఆలాపన



రామకోటి ఆలపిస్తున్న భక్తులు

చౌడేపల్లె: కొండయ్యగారిపల్లె పంచాయతీ పరిధిలోని బిల్లేరు రామాలయంలో ఆదివారం రామకోటిని ఆలపించారు. ముందుగా రామాలయంలో అర్చకుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. గ్రామస్తుల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కార్యక్రమానికి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. 24 గంటల పాటు నిర్విరామంగా రామకోటి ఆలపిస్తున్నట్లు వారు పేర్కొన్నారు.

అమ్మవార్లకు విశేష పూజలు



పూజలు చేస్తున్న భక్తులు

రొంపిచెర్ల: బొమ్మయ్యగారిపల్లె పంచాయతీ పాతకురవపల్లెలోని ఆరబాలమ్మ, గంగమ్మ, ముత్యాలమ్మ ఆలయాల్లో ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. మూడు ఆలయాల్లో శనివారం విగ్రహా ప్రతిష్ట కార్యక్రమాన్ని నిర్వహించారు. 41 రోజులపాటు నిత్యం ఆలయాల్లో పూజలు చేయాలని అర్చకులు సూచించారు. గ్రామంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

వేడుకగా సత్యసాయిబాబా జయంతి వేడుకలు



బాబా జయంతి వేడుకల్లో సభ్యులు

కుప్పం: సత్యసాయిబాబా 100 జయంతి వేడుకలను ఆదివారం సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఉదయం సత్యసాయి బాబా చిత్ర పటానికి పూజలు జరిపి ఊరేగించారు. అనంతరం గోపూజ నిర్వహించి, ఏకాదశి రుద్రాభిషేకం 15 మంది వేద పండితులచే నిర్వహించారు. సత్యసాయి సేవా సమితి సభ్యులు మధుసూదన్, నాగేంద్ర పాల్గొన్నారు.

పలమనేరు గంగ జాతరకు చాటింపు

- వైభవంగా గెరిగ ప్రతిష్ట
- మారెమ్మ, గంగమ్మ ఆలయాల్లో ప్రత్యేక పూజలు
- పక్షం పాటు ఆలయంలో సాగనున్న జాతర పూజలు



పలమనేరు: పలమనేరు పట్టణంలో ఏటా ప్రతిష్టాత్మకంగా జరిగే తిరుపతి గంగమ్మ జాతరలో భాగంగా ఆదివారం అమ్మవారి గెరిగ ప్రతిష్ట ఘనంగా జరిగింది. ఆదివారం అర్ధరాత్రి నుంచి సోమవారం ఉదయం దాకా గంగచాటు జరగనుంది. ఈసందర్భంగా మారెమ్మ ఆలయం వద్ద అమ్మవారి విగ్రహాన్ని శుద్ధిచేసిన జలాన్ని గంగమ్మ ఆలయానికి మేళతాళాలు, మంగళవాయిద్యాల మధ్య తీసుకొచ్చారు. అనంతరం అక్కడ అభిషేక కార్యక్రమాలు జరిగాయి. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఈసందర్భంగా గంగమ్మ, మారెమ్మ ఆలయాల వద్ద ప్రత్యేకపూజలు జరిగాయి. ఆలయం వద్ద ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. ఇందులో ఆలయ పాలకమండలి చైర్మన్ నరేష్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు. గంగ జాతర సందర్భంగా ఈనెల 16 దాకా గంగమ్మ ఆలయం వద్ద నిత్యం ప్రత్యేకపూజలు, మారెమ్మ ఆలయం వద్ద పొంగళ్లు, అభిషేకాలు జరగనున్నాయి.

ఘనంగా వాసవీ జయంతి



రామకుప్పంలో వాసవీ అమ్మవారు,



పెద్దపంజాణిలో..



బైరెడ్డిపల్లెలో..

రామకుప్పం: మండలంలోని రామకుప్పం, ఆనిగానూరు గ్రామాల్లో కన్యకాపరమేశ్వరీ ఆలయంలో శ్రీవాసవీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఉదయం అమ్మవారికి ప్రత్యేక అభిషేకం, పూజలు నిర్వహించారు. గ్రామంలో గంగా కలశం ఊరేగింపు చేశారు. మధ్యాహ్నం శాంతి హోమాలు, మహా మంగళహారతి పూజలు నిర్వహించారు. స్థానిక ఆర్యవైశ్య సంఘం సభ్యులు పాల్గొన్నారు.

పెద్దపంజాణిలో..

పెద్దపంజాణి: రాయలపేటలో వెలసిన శ్రీకన్యకా పరమేశ్వరి ఆలయంలో వాసవీ మాత జయంతి వేడుకలు ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అమ్మవారి మూలవిరాట్‌కు విశేష పూజలు, అభిషేకాలు చేశారు. అనంతరం అమ్మవారిని పలు రకాల పుష్పాలు, వెండి చీర, కవచాలతో అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. అనంతరం అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని పురవీధుల్లో ఊరేగించారు.

బైరెడ్డిపల్లెలో..

బైరెడ్డిపల్లె: బైరెడ్డిపల్లె కన్యకాపరమేశ్వరి ఆలయంలో శ్రీవాసవి జయింతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఉదయం అష్టావధానం, వివిధ పూజలు చేశారు. మధ్యాహ్నం మహామంగళహారతి, అమ్మవారి పట్టుచీర వేలం పాట నిర్వహించారు. రాత్రి అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. వాసవీ ఫౌండేషన్ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

సరిహద్దు రోడ్లకు మహర్దశ



మాదనపల్లె వద్ద చురుగ్గా సాగుతున్న రోడ్డు పనులు

పుంగనూరు: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కర్ణాటక సరిహద్దు లింకు రోడ్లకు మహర్దశ పట్టింది. 30 సంవత్సరాలుగా బండిబాటగా ఉన్న రోడ్డును విస్తరించి, పనులు చేపట్టాలని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆదేశించారు. ఈ మేరకు అధికారులు రోడ్డు పనులు ప్రారంభించారు. గూడూరుపల్లె నుంచి పిచ్చిగుండ్లపల్లె నుంచి పలమనేరు నియోజకవర్గంలోని మాదనపల్లె మీదుగా 2 కిలోమీటర్లతో కర్ణాటక రోడ్డుకు అనుసంధానం చేయనున్నారు. రూ.70 లక్షలతో మట్టిరోడ్డు పనులను చురుగ్గా సాగుతున్నాయి. ఈ రోడ్డు పూర్తి కాగానే కర్ణాటక ప్రాంత వాసులు నేరుగా చిత్తూరు హైవే ఎంబీటీ రోడ్డులో కలిసేందుకు సులభతరంకానుంది. ఈ ప్రాంత వాసులు రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం



సమావేశమైన పూర్వవిద్యార్థినులు

పలమనేరు: పట్టణ సమీపంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ మహిళా కళాశాలలో 1985 సంవత్సరం నుంచి 2022 దాకా చదువుకున్న పూర్వ బాలికల అపూర్వ సమ్మేళనం శనివారం స్థానిక కళాశాలలో వైభవంగా జరిగింది. కార్యక్రమానికి సాంకేతిక విద్యాశాఖ సంయుక్త సంచాలకులు పద్మారావు, ప్లేస్‌మెంట్ అధికారి రామక్రిష్ణ, స్థానిక మున్సిపల్ చైర్‌పర్సన్ పవిత్ర, పూర్వ ప్రిన్సిపాళ్లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. 37 సంవత్సరాల మధ్య కాలంలో చదువుకున్న విద్యార్థినులు ఇందులో పాల్గొన్నారు. చదువుకున్న రోజుల్లో జరిగిన సంఘటనలను వారు గుర్తుచేసుకున్నారు. ఇక్కడ చదువుకున్న విద్యార్థినులు నేడు ఇస్రో శాస్త్రవేత్తలుగా, పలు శాఖల్లో ఇంజినీర్లుగా పనిచేయడం ఆనందంగా ఉందని ప్రస్తుత ప్రిన్సిపల్ డా.మహమూద్ తెలిపారు. ఈ సందర్భంగా జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి.

తెలుగు కవిత్వాన్ని మలుపు తిప్పిన మహాకవి శ్రీశ్రీ



శ్రీశ్రీ జయంతి వేడుకలో సమితి నిర్వాహకులు

పలమనేరు: ఆకాశపు దారులవెంట హడావుడిగా వెళ్లే కవితా జగన్నాథ రథాన్ని భూమార్గం వైపు పట్టించిన మహాకవి శ్రీశ్రీ అని స్థానిక తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్షుడు తులసీనాథం నాయుడు పేర్కొన్నారు. పట్టణ సమీపంలోని కళామందిరంలో శ్రీశ్రీ జయంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. అనంతరం శ్రీశ్రీ రాసిన పుస్తకాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సమితి నిర్వాహకులు, తెలుగు భాషాభిమానులు పాల్గొన్నారు.